క్లుప్తంగా

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

● డీఎస్పీ శ్రీనివాసరావు



ఏఎస్సై మూర్తిని అభినందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నెల్లిమర్ల: సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు మరింత కృషి చేయాలని విజయనగరం డీఎస్పీ ఎం. శ్రీనివాసరావు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సీఐ రామకృష్ణతో మాట్లాడుతూ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మత్తు పదార్థాల నిర్మూలనకు తీసుకున్న చర్యలపై డీఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సై గణేష్, ఏఎస్సై మూర్తి, హెచ్‌సీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ సీఆర్‌పీ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గురువులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.లక్ష్మణనాయుడు, గౌరవ అధ్యక్షుడు బీఎస్ మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ సింహాచలం, కోశాధికారి లక్ష్మణ్, మహిళా ప్రతినిధులు రమాదేవి, అనిత, చిన్నమ్మడు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా జీవించాలి

● ఎస్సై సన్యాసినాయుడు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై సన్యాసినాయుడు

డెంకాడ: సమాజంలో బాధ్యత గల పౌరులుగా ప్రతి ఒక్కరూ ఆదర్శవంతంగా జీవించాలని ఎస్సై ఎ.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద గల ఏపీ మోడల్‌స్కూల్‌లో 'సంకల్పం' ప్రచారయాత్రలో భాగంగా నేరాల నియంత్రణపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగం వల్ల జీవితాలు నాశనమవుతాయని చెప్పారు. అలాగే సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహన చోదకులు రహదారి భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ హెచ్‌సీ రామారావు, పీసీలు శ్రీను, రామరాజు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

శృంగవరపుకోట: స్థానిక మోక్షవిద్య యోగమందిర్ నిర్వాహకులు పట్టణంలోని శ్రీనివాస కాలనీ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఇంటింటికీ భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మోక్షవిద్య యోగమందిర్ అధ్యక్షుడు ఎస్.ధారాజు మాట్లాడుతూ భగవద్గీత పఠనం ప్రతీ భారతీయుని కర్తవ్యం కావాలనిచ అందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. భగవద్గీత చదవాల్సిన ఆవశ్యకతను, ప్రాముఖ్యతను వివరించారు. మోక్షవిద్య యోగమందిర్ కార్యదర్శి డాక్టర్ ఆర్.కిశోర్, సలహాదారు టి.అప్పారావు, కోశాధికారి ఎస్.పెదకాపు, సభ్యులు ప్రసాద్, జగన్నాథరావు, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామ సమీపంలో వేపాడ పంచముఖ గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం నేతృత్వంలో బ్రాహ్మణ కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. అతిథులుగా హాజరైన డాక్టర్ పేరి రామయ్య పంతులు, బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ మేనేజర్ ఎం.వెంకటనర్సింహమూర్తి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన బ్రాహ్మణ యువత అంతా బ్రాహ్మణ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. సభ్యులకు 59 ఏళ్ల వరకూ బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. సొసైటీలో ఆర్‌డీ ఖాతాలతో పాటు అరుంధతి, వశిష్ఠ తదితర రుణాలను తక్కువ వడ్డీకి ఇస్తామన్నారు. బ్రాహ్మణులు ఐక్యంగా ఉంటూ సంఘాలను బలోపేతం చేసుకోవడం ద్వారానే ఆర్థిక, సాంఘిక, సామాజిక హోదా సాధ్యమవుతుందన్నారు. ఈసందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం సీనియర్ సిటిజన్లను సన్మానించి, సహపంక్తి భోజనాలు చేశారు.

● వేడుక ఏదైనా కేకులకు తగిన ప్రాధాన్యం
● అన్ని శుభ కార్యక్రమాల్లో ఆనవాయితీగా మారుతున్న వైనం
● కొత్త సంవత్సర వేడుకలకు ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్న వ్యాపారులు

ఫంక్షన్ ఏదైనా..

కేక్ ఉండాల్సిందే..



నగరంలోని ఓ దుకాణంలో విక్రయాలకు సిద్ధంగా ఉన్న కేకులు

విజయనగరం: ట్రెండ్ మారుతోంది.. వేడుకల్లో నేటితరం అభిరుచి భిన్నంగా ఉంటోంది. ప్రపంచ పోకడల ప్రభావంతో యువత కొత్త ఆలోచనలు చేస్తున్నారు. పలు వేడుకలను రొటీన్‌కు భిన్నంగా జరుపుకునేందుకు ఉత్సాహపడుతున్నారు. దీంతో ఎలా కోరితే.. అలా ఆకర్షణీయ కేక్‌లను తయారు చేయడంపై బేకరీల నిర్వాహకులు దృష్టిసారిస్తున్నారు. పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సవం, కొత్త సంవత్సరం, పండుగలు, ప్రత్యేక దినోత్సవం.. ఇలా జీవితంలో మరచిపోలేని రోజు ఏది ఉన్నా వేడుకలు జరుపుకుంటున్నారు. ఆ జ్ఞాపకాలను మదిలో బంధించుకుంటున్నారు. ఈ ట్రెండ్‌ను బేకరీల నిర్వాహకులు అందిపుచ్చుకుంటున్నారు. చిన్నారుల పుట్టిన రోజు, బారసాల (నామకరణం) వంటి వేడుకలకు సంబంధించి కొంతకాలంగా పెద్ద ఎత్తున ఆర్డర్లు వస్తున్నాయని బేకరీ యజమానులు చెబుతున్నారు. ఆయా చిన్నారులను మురిపించేందుకు వారి చిత్రాలతో పాటు.. మనసుకు హత్తుకునేలా కార్టూన్, సీరియల్స్ బొమ్మలను కేకులపై అందంగా సృష్టిస్తున్నారు. ఆడపిల్లల జన్మదిన వేడుకలు, ఓణీల ఫంక్షన్లప్పుడు బార్బీ బొమ్మలకు చాక్లెట్లు, బిస్కెట్లను ఆకట్టుకునేలా అలంకరించి కానుకగా సమర్పించడం ఇప్పుడో ట్రెండ్‌గా మారింది. రాజకీయ నాయకులు, సినీ హీరోల జన్మదినోత్సవాలు, ఇతర వేడుకల్లో వారి చిత్రాలతో భారీ కేకలను తయారు చేయిస్తున్నారు. త్వరలో కొత్త సంవత్సర వేడుకలకు ఆహ్వానం పలుకబోతున్నాం. నేటి యువత అభిరుచికి తగ్గట్టుగా పలు డిజైన్లలో కేకులను తయారు చేసి అందిస్తున్నామని బేకరీ నిర్వాహకులు చెబుతున్నారు.

కొత్తగా... ఆకర్షించేలా...

కేకుల తయారీదారులు తమ సిబ్బందికి కావాల్సిన నైపుణ్యాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తుండడం విశేషం. కొత్తగా..కంగొత్తగా.. జనం అభిరుచులకు తగినవిధంగా కేకుల తయారు చేసేలా వారిని ప్రోత్సహిస్తున్నారు. మరోవైపు ఆరోగ్యంపై దృష్టి పెరిగినందున.. వినియోగదారుల అభిరుచులకు తగినవిధంగా రసాయనాలు వినియోగించని కేకులను ఆధునిక యంత్రాలతో తయారు చేస్తున్నారు. ఇందుకోసం డ్రై ఫ్రూట్స్, పండ్లతో నేచురల్ కేకులు తయారు చేస్తుండడం విశేషం. అలంకరణగా కివీ, డ్రాగన్ ఫ్రూట్స్, యాపిల్, కమలాలు, జామ, దానిమ్మ, తదితర పండ్ల ముక్కలను, సలాడ్లను వినియోగిస్తున్నారు. కరోనా అనంతరం ఇలాంటి ఉత్పత్తులకు ఆదరణ పెరిగినట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. వెజిటేరియన్ ఉత్పత్తులకు డిమాండ్ క్రమంగా పెరుగుతోందని తెలిపారు.

కేకుల సంప్రదాయం పెరుగుతోంది..

వేడుక ఏదైన కేక్ కటింగ్ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సంప్రదాయం విజయనగరంలో విస్తరిస్తుండడంతో వినియోగదారులకు అవసరమైన రీతిలో కేకులు తయారు చేయడంపై దృష్టి సారిస్తున్నాం. నూతన సంవత్సర వేడుకలకు వందలాది కేకులు సిద్ధం చేస్తున్నాం. ఎగ్ కేకులు, ఎగ్‌లెస్, కూల్ కేక్, డ్రైఫ్రూట్స్, తదితర రుచుల మేలవింపుతో తయారీ చేస్తున్నాం. వినియోగదారులు ముందుస్తుగా ఆర్డర్ చేస్తే వారికి నచ్చిన రీతిలో కేక్‌లను సిద్ధం చేస్తాం.

– ఉమ, బేకరీ నిర్వాహకుడు, విజయనగరం.

● రక్తదాన శిబిరం



నెల్లిమర్ల మండలం జరజాపుపేట గ్రామంలో సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని గరివిడి ఎంఈఓ పోలుబోతు రామారావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 48 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అవనాపు భానుప్రకాష్, మద్దిల సన్యాసిరావు, ఆనంద్, పోలుబోతు దుర్గాప్రసాద్, బెల్లాన వెంకటరావు, పసుమర్తి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు. – నెల్లిమర్ల

● అభినందనలు..



నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అల్లూరి మురళిని ఎస్పీ వకుల్ జిందల్ ఆదివారం ప్రత్యేకంగా తన కార్యాలయంలో అభినందించారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయడం .. సంకల్పం కార్యక్రమంలో భాగంగా యువత చెడు అలవాట్లకు లోనుకాకుండా అవగాహన కల్పించడంలో మురళి చురుకైన పాత్ర పోషించారు. దీంతో ఎస్పీ ఆయనకు ప్రశంసాప్రతం అందజేయడంతో పాటు భవిష్యత్‌లో మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. – నెల్లిమర్ల

శిష్టకరణాల ఐక్యత చాటిచెప్పాలి

● సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు



నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న శిష్టకరణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు, తదితరులు

విజయనగరం టౌన్: శిష్టకరణ కులస్తుల ఐక్యతను చాటిచెప్పాలని సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంపీజీ.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బృందావనం అపార్ట్‌మెంట్‌లో సంఘం ఆత్మీయ కలయిక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సభ్యులందరూ ఒకేతాటిపైన నడిచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం ఇటీవల నిర్వహించిన వివాహ పరిచయ వేదిక పుస్తకం, నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు త్రినాథ్ ప్రసాద్, కార్యదర్శి రేగ సురేష్, బగ్గం సుధాకర్ పట్నాయక్, పాండ్రంకి వెంకటేష్, గోవింద సుధాకర్, శ్రీనివాస పట్నాయక్, వరప్రసాద్, జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

మనోస్థైర్యం తప్పనిసరి



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణాజీ

● జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణాజీ

విజయనగరం అర్బన్: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు శిక్షణతో పాటు మనోస్థైర్యం తప్పనిసరని జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ అన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'ఉద్యోగ పోటీ పరీక్షలకు ఎలా సిద్ధపడాలి' అనే అంశంపై స్థానిక గురజాడ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలను భయంతో కాకుండా ఇష్టంతో రాయాలని సూచించారు. భయం వల్ల మంచి ఫలితాలను సాధించలేమన్నారు. జన విజ్ఞాన వేదిక జాతీయ విద్యా కమిటీ కన్వీనర్, మానసిక నిపుణుడు డాక్టర్ ఏవీ రాజశేఖర్ మాట్లాడుతూ.. క్రమశిక్షణతో ఉన్నప్పుడే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించగలరన్నారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు గంట్రేటి లక్ష్మణరావు, జాతీయ కార్యదర్శి గంట్రేటి అప్పలనాయుడు, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పైల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పట్టణ అధ్యక్షుడు షణ్ముకరావు, ఈశ్వరరావు, దుర్గారావు, గంగాధరరావు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి..

విజయనగరం ఫూల్‌బాగ్: మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పీహెచ్ కార్మికులకు పారిశుధ్య కార్మికులతో సమానంగా వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడ తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఇంజినీరింగ్ విభాగం కార్మికుల సమావేశం కె.ఆదినారాయణ అధ్యక్షతన ఆదివారం ఎల్బీజీ శ్రామిక భవన్ సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారినా ఇంజినీరింగ్ కార్మికుల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. 8 గంటల పని చేసిన ప్రతి కార్మికుడికీ కనీసం రూ.26 వేలు ఉండాలని కమిటీలు చెబుతున్నా.. కనీసం 15 వేల రూపాయలు రావడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికులకు జీతాలు పెంచాలని కోరారు. ఈ మేరకు జనవరి 3న మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. జగన్‌మోహనరావు, సుంకరి రామానాయుడు, ఎస్. నారాయణరావు, శ్రీను, అప్పారావు, భాస్కరరావు, గంగయ్య, పైడి రాము, కనకరాజు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలి



మయూరి జంక్షన్ వద్ద వృద్ధుడికి దుప్పటి కప్పుతున్న సంఘ ప్రతినిధులు

విజయనగరం టౌన్: సేవాకార్యక్రమాలకు యువత ముందుకు రావాలని లిఫ్టింగ్ హ్యాండ్స్ సేవాసంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ సత్తి అచ్చిరెడ్డి, కోశాధికారి ఆలుగు వెంకటరావు పిలుపునిచ్చారు. ఆదివారం వేకువజామున 4 గంటల ప్రాంతంలో చలిలో ఇబ్బంది పడుతున్న పలువరు వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డు, వైఎస్సార్ సర్కిల్, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్, కన్యకా పరమేశ్వరి ఆలయం, గంటస్తంభం, మూడు లాంతర్లు జంక్షన్, కోట, బాలాజీ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, మయూరి కూడలి వద్ద నిరాశ్రయులకు దుప్పట్లు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ అన్నదాన ట్రస్ట్ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి విష్ణుగాయత్రి, సభ్యులు కట్టా రమేష్, వేణుపూర్ణిమ, రవి, శివప్రసాద్, చంద్రశేఖర్, ముత్యాలు, సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

● హరిదాసుల సందడి..



గ్రామాల్లో హరిదాసుల సందడి నెలకొంది. నెలగంటు పెట్టినప్పటి నుంచి హరిదాసులు కీర్తనలు ఆలపిస్తూ గ్రామాల్లో సందడి చేస్తుండడంతో మహిళలు బియ్యంను స్వామివార్లకు సమర్పించుకుంటున్నారు. ద్వారపూడిలో ఓ హరిదాసు సందడి చేయడం శనివారం సాక్షి కంటపడింది.

– విజయనగరం రూరల్

● రోడ్ల మీదే పశువులు..



విజయనగరంలోని ప్రధాన రహదారులు పశువులకు ఆవాసంగా మారుతున్నాయి. ఫలితంగా ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదాచారులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే లంకవీధి జంక్షన్ నుంచి ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్‌కు వెళ్లే మార్గాలలో పదుల సంఖ్యలో పశువులు రోడ్లపై అడ్డంగా తిష్ట వేస్తున్నాయి. ఓ వైపు నగర అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామంటూ ప్రకటనలు చేసే కార్పొరేషన్ అధికారులకు రోడ్ల మీద పశువులు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువుల సంచారంపై దృష్టి సారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు. – విజయనగరం

● అన్న సమారాధన..



మాసశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని స్థానిక కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో ఆదివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మందికిపైగా భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమణమ్మ, మారమ్మ, ప్రసాద్, శోభారాణి, భీమ, సోమశేఖర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం టౌన్

● రోడ్డు మీదే మురుగునీరు..



భోగాపురం మండలంలోని ముంజేరు గ్రామంలో రోడ్డుమీదుగానే మురుగునీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈగలు, దోమలు వృద్ధి చెంది అంటురోగాలు ప్రబలుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ముక్కాం ఆక్వా హేచరీస్, మిరాకిల్ కళాశాల, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు వేళ్లే వాహచోదకులు కూడా ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంది. మురుగునీరు వల్ల ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి మురుగు సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. – భోగాపురం

సమ్మె మరింత ఉధృతం చేస్తాం..

చీపురుపల్లి: నూతన వేతన ఒప్పందం అమలు చేసే వరకు సమ్మె కొనసాగించడమే కాకుండా మరింత ఉధృతం చేస్తామని వెంకట్రామా పౌల్ట్రీస్ పరిశ్రమ కార్మికులు, సీఐటీయూ నాయకులు టి.వి.రమణ, ఏ.గౌరునాయుడు చెప్పారు. మండలంలోని కర్లాం వద్ద గల వెంకట్రామా పౌల్ట్రీస్ పరిశ్రమ వద్ద కార్మికులు మూడో రోజు నిరవధిక సమ్మె కొనసాగించారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఒప్పందం ప్రకారం నూతన వేతన ఒప్పందం అమలు చేయాలని ఆరు నెలలుగా కార్మికులు కోరుతున్నప్పటికీ యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. అయినప్పటికీ కార్మికులు ప్రశాంత వాతావరణంలోనే నిరసన తెలిపారన్నారు. నూతన వేతన ఒప్పందం విషయంలో యాజమాన్యం మొండి వైఖరి అవలంబించడంతోనే నిరవధిక సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. సమ్మె మూడో రోజుకు చేరినప్పటికీ సమస్య పరిష్కరించకుండా అధిక సంఖ్యలో పోలీసులను రంగంలోకి దింపి కార్మికులను భయపెట్టాలని యాజమాన్యం చూస్తోందని ఆరోపించారు. కార్మికుల ఐక్యత ముందు ఎలాంటి భయాలు ఉండవని స్పష్టం చేశారు.కార్మిక సంఘ నాయకులు ఐ.గురునాయుడు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి ఆహ్వానం



ఎమ్మెల్యే లలితకుమారికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

లక్కవరపుకోట: విజయవాడలో జనవరి 5వ తేదీన నిర్వహించనున్న హైందవ శంఖారావం మహాసభకు హాజరు కావాలని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఆదివారం ఆహ్వానించారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యేను ఆమె స్వగృహంలో కలిసి ఆహ్వాన పత్రం అంద జేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ దేవాలయాలను ప్రభుత్వ ఆధీనం నుంచి తప్పించి స్వయం ప్రతిపత్తి కల్పించాలని, దేవాలయాల్లో అన్యమత ఉద్యోగులను తొలగించాలని, దేవాలయ ట్రస్టుబోర్డుల్లో రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా చూడాలని, దేవాలయ పరిసరాల్లో దుకాణాలు హిందువులకే కేటాయించాలన్న డిమాండ్లతో సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సభకు హైందవులంతా తరలివచ్చి విజయ వంతం చేయాలని కోరారు.ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ సీహెచ్.నర్సయ్య ,ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు కోరుపోలు అప్పారావు, ఎం.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.